క్లుప్తంగా

అన్నదానం మహాదానం



భూపాలపల్లి అర్బన్: అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో బుధవారం బుర్ర రమేష్ పాల్గొన్నారు. రోగుల బంధువులకు భోజనాలు వడ్డించి రమేష్ మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం చేయడం మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారికి ఎంతగానో ఉపయోగకరమన్నారు.

ఎంపీటీసీకి మాతృవియోగం

టేకుమట్ల(గోరికొత్తపల్లి): కొత్తపల్లిగోరి ఎంపీటీసీ ఎంఏ హమీద్ తల్లి అహ్మద్ బీబీ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



గణపురం: గణపురం మండలకేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠాపనకు మండలకేంద్రానికి చెందిన రాచర్ల ఆనందం రూ.1,00,116 విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీకి బుధవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం నేటి(గురువారం) నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. పాలిసెట్ -2023 ద్వారా డీఎంఈ, ఈసీఈ విభాగాల్లో ప్రవేశాలు నిర్వహించినట్లు మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 20న దరఖాస్తుల స్వీకరణ, 25న ఖాళీల వివరాల ప్రదర్శన, 28న స్పాట్ అడ్మిషన్ సర్టిఫికెట్ల పరిశీలన, ఫీజు చెల్లింపు అనంతరం 31న తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎచ్ఓడీలు కృష్ణ 94409 73492, రామ్మోహన్‌రెడ్డి, 91777 30404లో సంప్రదించాలని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎస్ఎస్ తాడ్వాయి : తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కాటాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పసినేటి రాజు మధ్యాహ్నం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రాజును స్థానిక కాటాపూర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య గౌడ్ కోరారు.

కేసు నమోదు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ కాలనీకి చెందిన కొప్పుల శ్రవ్యను 2021వ సంవత్సరం నుంచి వేధిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాధవపూర్ గ్రామానికి చెందిన శీలం రాకేష్‌పై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

19ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు

ఏటూరునాగారం: 1-19 సంవత్సరాలలోపు అర్హులైన చిన్నారులందరికీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, వైద్యులు మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ దగ్గర ఎన్‌డీడీ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్ సెంటర్ల వారీగా సి బ్బంది నులి పురుగుల మందుల పంపిణీతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్లి విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. సుమలత, శారద, కమల, గీత, పద్మ పాల్గొన్నారు.

గణపసముద్రం చెరువు



టేకుమట్ల శివారులో ప్రవహిస్తున్న చలివాగు



వదలని వాన

- రోజంతా చిరుజల్లు నుంచి మోస్తరు వర్షం
- నిండుతున్న చెరువులు, కుంటలు

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జిల్లాలో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఇన్నాళ్లు వానలు లేక ఎండిపోయిన పంటలకు జీవం పోసినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజంతా వాన కురియడంతో జనాలు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

గణపురం: గణపురం మండలంలో ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. మండలంలో మొత్తం 70 చిన్న చెరువులు, కుంటలు వుండగా వాటిలో ఇప్పటి వరకు 70 శాతం వరకు నీరు చేరుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒక్కటైన గణపసముద్రం పూర్తి నీటిమట్టం 30 అడుగులు కాగా రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం 16 అడుగులకు చేరుకుంది. సగానికి పైగా నీరు రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లువెత్తుతుంది. గణసముద్రం చెరువు కింద సుమారుగా 5,000ఎకరాల ఆయకట్టుతోపాటు, నియోజకవర్గంలోని 5 మండలాల ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుంది. మరో పక్క జోరుగా కురుస్తున్న వర్షాలతో మోరంచవాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది.

ఉప్పొంగుతున్న వాగులు

టేకుమట్ల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చలివాగు, మానేరు నీటి వరదతో ఉప్పొంగుతుంది. వరుస వర్షాలతో వరద ఉధృతి పెరుగుతున్నందున మానేరు, చలివాగు పరివాహక ప్రాంత ప్రజలు వాగులను దాటే జనం, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్, రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

మహాముత్తారం: మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గ్రామాల్లోని రోడ్లన్ని బురద మయమయ్యాయి. గ్రామాల్లోని చెరువులు కుంటల్లోకి నీళ్లు చేరాయి. జీలపల్లి, లింగాపూర్ ములుగుపల్లి, పోలారం వెళ్లే ప్రధాన రహదారుల్లోని లోలెవల్ కాజ్‌వేలు పొంగిపొర్లాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇబ్బంది పడ్డారు.



మహాముత్తారం: నిండుగా ప్రవహిస్తున్న జీలపల్లి-లింగాపూర్ ప్రధాన రహదారిలోని లోలెవల్ కాజ్‌వే

కారుబోల్తా.. ముగ్గురికి గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

కాటారం: కాటారం మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని డీఆర్డీఓ కార్యాలయంలో సైంటిస్ట్‌గా పని చేస్తున్న ఈడుపుగంటి భూషణ్‌రావు తన ఇద్దరు సోదరులతో కలిసి తండ్రి అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు కారులో కాళేశ్వరం వెళ్తున్నారు. మార్గమధ్యలో మేడిపల్లి వద్దకు రాగానే ఆకస్మాత్తుగా ఆటో అడ్డురావడంతో తప్పించబోయాడు. సరిగా అదే సమయానికి ఎదురుగా లారీ రావడంతో కారు రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. కారులోని ఏయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పిం.. ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. అదే సమయంలో ఆర్టీసీ బస్సులో వెళ్తున్న భూపాలపల్లికి చెందిన మహిళా కానిస్టేబుల్ నుశ్రత్ తబాస్సుం తోటి ప్రయాణికుల సాయంతో క్షతగాత్రులను మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో వివరాలు నమోదు చేసుకున్నట్లు ఎస్సై-2 తమాషారెడ్డి తెలిపారు.

కేసీఆర్‌తోనే రైతులకు భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మల్హర్: కేసీఆర్‌తోనే రైతులకు భవిష్యత్ అని రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని కొయ్యూరు రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా 24 గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతు మృత్యువాత పడితే కుటుంబానికి అండగా నిలువడానికి రైతు బీమా అమలు చేస్తున్నాడని తెలియజేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల ఉచిత విద్యుత్ చాలని హేళన చేస్తున్నాడని విమర్శించారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ కుట్రను గమనించి, మూడు గంటల ఉచిత విద్యుత్ చాలన్న కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, మండల కోప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగమూర్తి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరెడ్డి, నాయకులు యాదగిరిరావు, సింగిల్ విండో డైరెక్టర్లు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



రేగొండలో చెక్కులు అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో అందజేశారు. 17మంది బాధితులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నవారికి తక్కువ సమయంలోనే చెక్కులు వచ్చేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ, జెడ్పీటీసీ సాయిని విజయ, సర్పంచ్ ఏడునూతుల నిశీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్‌రావు, వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రహీంపాషా, రవి, ముత్యం పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



విద్యార్థులకు బోర్డుపై వివరిస్తున్న ఎంఈఓ

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్, వెంకట్రావుపల్లి (సి), నవాబుపేట, (హరిజనవాడ), ఏలేటి రామయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ కొడెపాక రఘుపతి బుధవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం నవాబుపేట పాఠశాలలో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థులకు పలకలు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఆదర్శ్, సీఆర్పీలు రాజు, సుదగాని నరేష్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పోల్నేని రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా కష్టపడి చదివి పాఠశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రఘు, సదానందం, శర్మ, మార్కండేయ, మాధవి, అనిత, పద్మ, ఫౌండేషన్ సభ్యులు సుధాకర్ యాదవ్, శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా అమలు చేయాలి

ములుగు రూరల్: రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన కార్యక్రమాన్ని అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేయాలని అన్నారు. రైతులకు సాగుకు సంబంధించిన ఎరువులను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. రైతులు అకాల వర్షాల కారణంగా యాసంగి సీజన్‌లో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, బలరాం, రమేస్, జవహర్‌లాల్, ఉత్తమ్‌కుమార్, రవిరెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

ఒంటి కాలుపై నిలబడి జీపీ కార్మికుల నిరసన



చిట్యాల: సమ్మెలో నిరసన తెలియజేస్తున్న జీపీ సిబ్బంది

మల్హర్: పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రం తాడిచర్లలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సిబ్బంది వేతనాల పీఆర్‌సీలో ఉన్న జీతం రూ.19,500 పెంచాలని, జీఓ 51ను రద్దు చేసి, 60 జీఓను అమలు చేయాలని పేర్కొన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించి, పంచాయతీ అసిస్టెంట్‌గా నామకరణం చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, 8గంటల పనిదినాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబార్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

చిట్యాల: తమ సమస్యలను పరిష్కరించాలని 14రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమార్‌లు మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న జీపీ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జీపీ సిబ్బంది డిమాండ్స్‌ను నెరవెర్చాలని కోరారు. యుగేందర్, కర్ణాకర్, మొగిలి, సతీష్, రత్నాకర్, దేవేందర్‌రెడ్డి, శంకర్, రాకేష్, రామస్వామి, సమ్మక్క, సారక్క, రాజమ్మ పాల్గొన్నారు.

పలువురి సంఘీభావం

మహాముత్తారం: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం 14వరోజు కొనసాగింది. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ములుగుపల్లి సర్పంచ్ దూలం మల్లయ్య సంఘీభావం తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికుల సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షఫీ, ఉపాధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాటారం: డిమాండ్ల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మండలంలో బుధవారం 14వ రోజు కొనసాగింది. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బుధవారం పంచాయతీ కార్మికులు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం జేఏసీ నాయకులు దోమల శ్రీనివాస్, మెండ మల్లయ్య మాట్లాడారు. సమ్మె చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిట్యాల శశికుమార్, కోశాధికారి ఆత్కూరి రవి, పప్పుల లక్ష్మినారాయణ, ఆత్కూరి రవి, కారోబర్లు దేవేందర్, మహేశ్, లచ్చయ్య, రమేశ్, మల్లయ్య, వెంకటి, ఎల్లారి, గౌరక్క, మల్లక్క, కమలక్క, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె బుధవారం 14వ రోజు కొనసాగింది. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడారు. క్యాతరాజు రాజయ్య, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం క్రిష్టయ్య, చేలిక సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మల్హర్: ఒంటి కాలుపై నిలబడిన కార్మికులు



మహాముత్తారం: సంఘీభావం తెలిపిన సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మల్లయ్య



కాటారం: మండల కేంద్రంలో..

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉంటూ, విద్యుదాఘాతం నుంచి రక్షణ పొందాలని విద్యుత్ ఏఈ అంబీరు మణిదీప్ సూచించారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం మాట్లాడుతూ.. మరో రెండు రోజుల పాటు భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ఇంట్లోని విద్యుత్ తీగలను తడి చేతులతో ముట్టుకోవద్దని, విద్యుత్ తీగలపై దుస్తులు వేయొద్దని సూచించారు. ఇంట్లో విద్యుత్ సమస్యలు తలెత్తితే అనుభవం గల ఎలక్ట్రీషియన్‌తో పనులను చేయించుకోవాలని చెప్పారు. వర్షాల సమయంలో ఎవరూ విద్యుత్ స్తంభాలను తాకొద్దని తెలిపారు. రైతులు పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, స్టార్టర్ డబ్బాలు నీటిలో తడవకుండా ఏర్పాటు చేసుకోవాలని, స్టార్టర్ డబ్బాలు ఇనుమువి కాకుండా పీవీసీ డబ్బాలను ఏర్పాటు చేసుకుంటే వర్షాకాలంలో మేలు అని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగినా, విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారినా వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

సభను విజయవంతం చేయండి



మద్దులపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు

కాళేశ్వరం: త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీస్ విశ్వరూప సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. బుధవారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరం, మద్దుపల్లి, పలుగుల గ్రామాల్లో ఎమ్మార్పీస్ సంఘాలను ఏకం చేస్తు పర్యటించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఇంటి కొక్కరు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. నాయకులు నల్లభాగ ధర్మయ్య, లింగాల సమ్మయ్య, చకినారపు రాసు, లేతకరి రాజయ్య, రవితేజ, రాజయ్య, వెంకటేష్, గణపతి, బానయ్య, మంద రాజయ్య, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..

వాజేడు: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దాట్ల వీర వెంకట సీతారామ రాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన నిధులను ఎమ్మెల్యేకు ఇవ్వలేదని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి సీఎం ఏం చేశారని ప్రశ్నించారు. విక్రాంత్, డెనార్జున రావు, కాజావళి, జగన్నాథరాజు, రాంబాబు, లింగయ్య, శ్రీను, సీతాలు, సర్వేశ్వరావు, సంజీవ ఉన్నారు.

సర్పంచ్‌పై దాడి.. మహిళల రాస్తారోకో



రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

మహదేవపూర్: సూరారం సర్పంచ్‌పై దాడిని ఖండిస్తూ.. గ్రామస్తులు బుధవారం మండల కేంద్రంలో జాతీయ రాహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సూరారం సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి ఇంటి గోడ విషయంలో నాగుల తిరుపతితో గొడవ జరిగింది. దీంతో సర్పంచ్‌పై దాడిని ఖండిస్తు గ్రామస్తులు మహిళలు మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రాస్తారోకో చేస్తున్న మహిళలకు నచ్చజెప్పి విరమింపజేశారు.